‘స్మార్ట్’గా లావాదేవీలు..

పల్లె నుంచి పట్నం వరకు పెరిగిన నగదురహిత లావాదేవీలు

- ఆన్‌లైన్ షాపింగ్‌కే ప్రజల మొగ్గు
- అప్రమత్తత తప్పనిసరి అంటున్న నిపుణులు

SUNDAY SPECIAL



భద్రాచలంటౌన్: ప్రస్తుత ఆధునిక సమాజంలో ప్రజల జీవన శైలితో పాటు టెక్నాలజీ విపరీతంగా అభివృద్ధి చెందుతోంది. ఎవరి చేతిలో చూసిన ఆండ్రాయిడ్ ఫోన్లు ఉండటంతో ప్రజలు ఎక్కువగా నగదురహిత లావాదేవీలపై మొగ్గు చూపుతున్నారు. ఫోన్లలో గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యాప్‌లు అందుబాటులో ఉండడంతో లావాదేవీలు ప్రజలకు తేలికగా మారాయి. డిజిటల్ టెక్నాలజీతో ఇంటి నుంచే బ్యాంకు సేవలను రాత్రీ పగలు తేడా లేకుండా వినియోగించుకుంటున్నారు.

దుకాణాల్లో పెరిగిన లావాదేవీలు..

పట్టణం నుండి పల్లెవరకు ప్రస్తుతం ప్రతీ దుకాణంలో డిజిటల్ లావాదేవీల సేవలు అందుబాటులో ఉన్నాయి. క్యూఆర్ కోడ్ స్కానర్ల సహాయంతో ఏం కొన్నా డబ్బులు చెల్లించే వీలుంది. బ్యాంకులు వివిధ మార్గాల ద్వారా నగదురహిత లావాదేవీలను ప్రోత్సహిస్తున్నాయి. బ్యాంకులు సైతం సొంత యాప్‌లు ఏర్పాటు చేసుకొని తమ వినియోగదారులకు ఏవిధంగా వినియోగించుకోవాలో వివరంగా తెలియజేస్తున్నారు. వృద్ధులు సైతం బ్యాంక్‌కు



పట్టణంలోని ఓ బుక్‌స్టాల్‌లో క్యూఆర్ కోడ్ స్కానర్లు

రాకుండా స్థానికంగా వుండే వినియోగదారులు సేవ కేంద్రాల వద్ద ఆధార్ నంబర్, వేలి ముద్ర ద్వారా డబ్బులు తీసుకుంటున్నారు. అలాగే బ్యాంక్ క్యూఆర్ కోడ్‌లను స్కానింగ్ చేయడం ద్వారా, ఐఎంపీఎస్, ఏటీఎం కార్డు, క్రెడిట్ కార్డులను స్వైప్ చేయడం ద్వారా నగదు రహిత లావాదేవీలు నిర్వహిస్తున్నారు.

పెరిగిన ఆన్‌లైన్ షాపింగ్

ప్రస్తుతం పట్టణాలలోనే కాకుండా గ్రామాల్లో సైతం ఆన్‌లైన్ షాపింగ్ జోరు భారీగా పెరిగింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తదితర యాప్‌ల ద్వారా అవసరమైన వస్తువులను ఆర్డర్ చేస్తున్నారు. వస్తువులు డెలివరీ తరువాతే డబ్బులు చెల్లించే సౌకర్యం వుండడంతో ప్రజలు ఎక్కువగా ఆన్‌లైన్ షాపింగ్‌లను కొనసాగిస్తున్నారు. తీసుకున్న వస్తువులు నచ్చకుంటే తిరిగి ఇచ్చే సదుపాయం ఉండడంతో ప్రజలు ఆన్‌లైన్ షాపింగ్‌కు అలవాటు పడ్డారు. కానీ నగదు రహిత లావాదేవీల విషయంతో ప్రజలు అప్రమత్తంగా వుండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆన్‌లైన్ లావాదేవీలకు గుర్తింపు ఉన్న యాప్‌లనే ప్రజలు వినియోగించాలని వారు సూచిస్తున్నారు.

బ్యాంకులకు వెళ్లాల్సిన పనిలేదు



గతంలో డబ్బుల కోసం బ్యాంకులకు లేదా ఏటీఎంలకు వెళ్లి గంటల తరబడి లైన్‌లో ఉండేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. లావాదేవీలు చేసేందుకు వీలుగా ఎన్నో యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని వినియోగించడం కూడా చాలా తేలిక.

– శ్రీను, భద్రాచలం

ఎన్నో ఆఫర్లు ఉన్నాయి



ఆన్‌లైన్ షాపింగ్ చేయడం ద్వారా సమయం ఆదా అవుతుంది. షాపులలో కంటే ఎక్కువ రకాల వెరైటీలు అందుబాటులో వుంటున్నాయి. పండుగల సమయంలో ఆయా కంపెనీలు ఎన్నో రకాల ఆఫర్లు ఇస్తున్నాయి.

– అశోక్, భద్రాచలం

కొనుగోళ్లు తగ్గాయి..



ఇంతకు ముందు షాపులకు వచ్చి ప్రజలు ఫోన్లు కొనేవారు. ప్రతీ ఒక్కరు ఆన్‌లైన్ షాపింగ్ చేస్తుండడంతో చిన్న షాపుల్లో కొనుగోళ్లు బాగా తగ్గాయి. ప్రస్తుతం యువత ఎక్కువగా ఆన్‌లైన్ కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నారు.

– రవి, మొబైల్ షాపు, భద్రాచలం

క్లుప్తంగా

విద్యారంగానికి 30 శాతం నిధులివ్వాలి

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి ప్రభుత్వం 30 శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పవన్ కుమార్ కోరారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాల నుంచి రింగ్ రోడ్డు, బస్టాండ్ సెంటర్ మీదుగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రతీ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ బాధ్యులు వంశీ, అభిమిత్ర, అజీమ్‌పాషా, నవీన్, సంతోష్, హేమంత్, సందీప్, జల్లి రమేష్ పాల్గొన్నారు.

‘దిశ’ వెల్ఫేర్ ఫౌండేషన్ అధ్యక్షురాలిగా అన్నపూర్ణ

అశ్వాపురం: దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ నూతన జిల్లా అధ్యక్షురాలిగా మండల కేంద్రంలోని కాలువబజార్ గ్రామానికి చెందిన మద్దెల అన్నపూర్ణ శనివారం ఎన్నికయ్యారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఫౌండర్ నేషనల్ చైర్మన్ బిరుదరాజు వెంకటేశ్వరరాజు అన్నపూర్ణకు గుర్తింపు కార్డు అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్షురాలుగా నియమించిన చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలకు అండగా ఉంటామన్నారు.

గుడుంబా మహమ్మారిని తరిమికొడదాం

గుండాల: పల్లెల్లో గుడుంబా మహమ్మారిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆళ్లపల్లి ఎస్సై రతీష్ అన్నారు. ఆళ్లపల్లి మండలంలో శనివారం ప్రజలకు గుడుంబా, డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో భవిష్యత్ ఉండే యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారుతున్నారన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై అరుణ్, ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, సర్పంచ్ గలిగె సమ్మక్క పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దమ్మపేట: మండల పరిధిలోని రాళ్ల బంజర గ్రామానికి చెందిన కారం గుండప్ప భార్య ఇటీవలే భార్య మరణించిన కారం గుండప్పకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆర్థిక సాయాన్ని స్థానిక నాయకుల ద్వారా శనివారం అందజేశారు. ఈమేరకు దశదిన కర్మ ఖర్చుల నిమిత్తం కొంత నగదును స్థానిక సర్పంచ్ సోయం చంటిబాబు ద్వారా అందజేశారు. సున్నం జోగరావు, శంకర్ పాల్గొన్నారు.

మణుగూరు రూరల్: బీఎస్సీ నర్సింగ్ చదువుతున్న మాదిగ ఐక్యవేదిక సభ్యులు సైనారపు నాగేశ్వరరావు కుమార్తె సంధ్యారాణిపై చదువుల నిమిత్తం జర్నలిస్ట్ మాచర్ల శ్రీనివాస్ రూ.10వేలు శనివారం ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి రామ్మూర్తి, మురళీ, నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ కమిటీ ఎన్నిక

చండ్రుగొండ : లంబాడీ హక్కుల పోరాట సమితి మండల కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. మండలాధ్యక్షుడిగా భూక్యా రాందాస్‌నాయక్, గౌరవాధ్యక్షుడిగా శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రమేష్ నాయక్, కోశాధికారిగా కె.రాంబాబునాయక్, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాణోత్ రంగానాయక్‌ను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జి.కేశవ్‌నాయక్, మోహన్‌నాయక్, బాబునాయక్, వీరన్ననాయక్, సేవ్యా పాల్గొన్నారు.

నేటి నుంచి సీహెచ్‌సీలో శస్త్రచికిత్సలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో నేటి (ఆదివారం) నుంచి శస్త్ర చికిత్సల విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణ చంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్పత్రికి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు నిధులతో, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ఆదేశాల మేరకు ఆస్పత్రి ఎంఎస్ జనరల్ సర్జన్ వైద్యులు తిలక్ ఆధ్వర్యంలో ఈ శస్త్ర చికిత్సలను ఇరవై నాలుగు గంటలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

జాతరకు సర్వం సిద్ధం

అశ్వాపురం: అశ్వాపురం-మణుగూరు మండలాల సరిహద్దులోని రేగులగండి క్షేత్రం వద్ద లింగమంతుల స్వామి ఆలయం వద్ద నేటి నుంచి మూడు రోజుల పాటు జరగనున్న యాదవుల కులదైవం శ్రీ భవాని లింగమంతుల స్వామి జాతరకు సర్వంసిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం శివభవాని రథాలు జగ్గారం గ్రామం నుంచి రేగులగండి బయలుదేరుతాయి. సోమవారం ఉదయం 5గంటలకు బోనాల ఉత్సవంతో జాతర ప్రారంభమవుతుంది. అనంతరం శ్రీ భవాని లింగమంతుల స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతర నిర్వహణ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతరకు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని యాదవులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించనున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



భద్రాచలం: డీడీకి వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు



భద్రాచలంటౌన్: ధర్నా చేస్తున్న నాయకులు

భద్రాచలం: వివిధ సమస్యలపై ఉపాధ్యాయులు చేసిన ప్రాతినిధ్యాలను పరిష్కరించాలని, గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో శనివారం ఐటీడీఏ డీడీ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.హరిలాల్ మాట్లాడుతూ... గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించటానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.రాజు, ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు ఎం.రామాచారి పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: ఏజెన్సీ, మైదాన ప్రాంతాలను వర్గీకరించి గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించాలని గిరిజన ఉపాధ్యాయ యూనియన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం భద్రాచలం ఐటీడీఏ ముందు ధర్నా నిర్వహించి పీవో గౌతమ్ పోట్రుకి వినతి పత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న చేపట్టిన చలో అసెంబ్లీని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

అశ్వాపురం: విద్యార్థులు విద్యార్థి దశలోనే ఉత్తమమైన లక్ష్యాలను నిఱంచుకొని లక్ష్యాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలని అశ్వాపురం, పినపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్‌లు సత్యప్రకాష్, శేషుబాబు అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుధాకర్‌రెడ్డి, రవీందర్, రాఘవేంద్ర, రాములు, ఉషారాణి, సునిత, నాగిని, అరుణ, సాజిద్ పాల్గొన్నారు.

కేన్సర్ ప్రాణాంతకం కాదు

భద్రాచలంటౌన్: కేన్సర్ వ్యాధి ప్రాణాంతకం కాదని, సరైన సమయంలో దానిని గుర్తించి ముందస్తు చికిత్స చేయించుకుంటే వ్యాధి నుంచి బయటపడే అవకాశాలుంటాయని భద్రాచలం సబ్‌జైల్ సూపరింటెండెంట్ జీడుగు ఉపేందర్ అన్నారు. ఈ సందర్భంగా కేన్సర్‌పై అవగాహన కలిగించేందుకు ముద్రించిన పోస్టర్లను ఆయన శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఒక హృదయం సంస్థ అధ్యక్షుడు మిట్టకంటి సంజీవరెడ్డి, కోశాధికారి కవిత, కదాలి నాగరాజు, వెంకటేశ్వరరావు, రవళి తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ సన్నాహక సమావేశం

భద్రాచలంటౌన్: భద్రాచలంలో నేషనల్ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా జ్యూడిషల్ కోర్టులో కో ఆర్డినేషన్ మీటింగ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యూడిషల్ కోర్టు జడ్జి నీలియ మాట్లాడుతూ.. ఈ నెల కేసుల్లో రాజీ పడే అవకాశం ఉందన్నారు. సీఐ నాగరాజు, ఎస్సై మధు ప్రసాద్, లాయర్లు దుర్గభాయ్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాద్రి హరిహర క్షేత్రంలో అయ్యప్ప స్వామి వారి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకను శబరిమలై విధానంలో శ్రీమాన్ సంజీవన్ తంత్రీ వారి నేతృత్వంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం విశేష సుదర్శన హోమం అర్చకులు అరుణ్ రామచంద్ర నంబుద్రి చేశారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆర్డీఓ రత్న కల్యాణి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అడుగుమిల్లి జగదీష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆలయ ప్రతిష్ఠాపనలో మాజీ మంత్రి తుమ్మల



పూజలు చేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు

దమ్మపేట: మండల పరిధిలోని చిల్లగుంపులో సీతారాముల విగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవానికి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై పూజలు నిర్వహించారు. శనివారం చిల్లగుంపు గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి విచ్చేసిన తుమ్మలకు, ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు బండి పుల్లారావు, కొయ్యల అచ్యుతరావు, చెలికాని ప్రసాద్, కాసాని నాగప్రసాద్ పాల్గొన్నారు.

పోరాటాల ఫలితమే వేతనాల పెంపు

అశ్వారావుపేటరూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా ప్రభుత్వం మధ్యాహ్న వంట కార్మికుల వేతనాలను పెంచిదని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో కనకమ్మ, రాములమ్మ, యామిని పాల్గొన్నారు.

ములకలపల్లి : సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన అవిశ్రాంత పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెంపు జరిగిందని తెలంగాణా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు బుగ్గా వెంకటనర్సమ్మ అన్నారు. మండలకేంద్రంలో శనివారం జరిగిన సంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షురాలు భూక్యా క్రాంతి, అనసూర్య, సంఘం అంజమ్మ, పావని, జయ, కీసరి సుజాత పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతూ జీఓ విడుదల చేసినట్లు సీఐటీయూ శ్రామిక మహిళా కన్వీనర్ మర్గపాటి రేణుక అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నాగరాజు, కోమల, రమాదేవి, సఫియా, రాజేశ్వరి, దమయంతి తదితరులు పాల్గొన్నారు.

సఫలమైన చర్చలు

మణుగూరు రూరల్: మణుగూరు ఏరియాలోని గ్లోబల్ కోల్ వాషరీ ప్లాంట్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై కంపెనీ యాజమాన్యంతో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు శనివారం జరిపిన చర్చలు సఫలమయ్యాయి. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర నాయకులు అయోధ్య మాట్లాడుతూ.. ప్లాంట్ మూసివేసే నేపథ్యంలో కంపెనీ కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సిన గ్రాట్యుటీ, బోనస్, పీఎఫ్‌లపై కంపెనీ యాజమాన్యంతో చర్చలు జరపగా వాటన్నింటిని కార్మికులకు చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు.

‘ఉపాధి’కి నిధులు తగ్గించడం తగదు



అశ్వారావుపేటరూరల్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అశ్వారావుపేటరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం తగదని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగినపల్లి ప్రభాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీఓ సీతారామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఎస్.ఏడుకొండలు, జెట్టి లక్ష్మణుడు, నాగేశ్వరరావు, బేతి లక్ష్మీ పాల్గొన్నారు.

దమ్మపేట: ఉపాధి హామీ కార్మికుల పనిదినాలను పెంచాలని కోరుతూ అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, స్థానిక ఎంపీడీఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, తోడెం దుర్గమ్మ, వగ్గెల ప్రసాద్, వాడే జోగారావు, పాపారావు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిదినాలు పెంచాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నూపా భాస్కర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ ఆర్.చిన్ననాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి లక్ష్మణ్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లూరి కిషోర్, నాయకులు బండారు నాగేంద్రబాబు, ఓరుగంటి శ్రీను, దేవయ్య పాల్గొన్నారు.

కనులపండువగా పునర్వసు కల్యాణం



కల్యాణం అనంతరం ప్రత్యేక సేవలో స్వామివారు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరాముడి జన్మనక్షత్రం సందర్భంగా ప్రతీ నెల నిర్వహించే పునర్వసు కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అర్చకులు శేషం కిరణ్ కుమారాచార్యులు, ప్రతాపురం భార్గవాచార్యులు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకొచ్చారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం పురవీధుల గుండా స్వామి వారికి ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి పోలీసుల కృషి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ

గుండాల: మారుమూల గ్రామాల్లో ఉంటున్న గిరిజనుల అభివృద్ధికి పోలీసుల కృషి ఎల్లప్పుడూ ఉంటుందని ఇల్లందు డీఎస్పీ రమణమూర్తి అన్నారు. మండలంలోని దామరతోగు గ్రామంలో శనివారం గ్రామస్తులకు దుప్పట్లు, సోలార్ లైట్లు, వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యువత మత్తుకు బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దన్నారు. ఉన్నత చదువులను అభ్యసిస్తూ ప్రభుత్వం అందించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాహనదారులు విధిగా లైసెన్సులు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలన్నారు. ఏ విషయంలోనైనా పోలీసులను ఆశ్రయించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఇక నక్సల్స్‌కు సహకరించడం, వసతి కల్పించడం లాంటివి చేస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. పిల్లల భవిష్యత్ తల్లిదండ్రుల చేతిలోనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కరుణాకర్, ఎస్సై రాజశేఖర్, సర్పంచ్ సరోజన, ఎంపీటీసీ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో ప్రయోజనం



మాట్లాడుతున్న ఏడీఏ తాతారావు

బూర్గంపాడు: యాసంగిలో రైతులు సాగుచేసిన వరిలో కాలిబాటలు తీసుకోవటం వలన అధిక ప్రయోజనాలను పొందవచ్చని మణుగూరు వ్యవసాయ డివిజన్ సహాయ సంచాలకులు బి.తాతారావు సూచించారు. మండలంలోని ఇరవెండి గ్రామంలో శనివారం వరిలో కాలిబాటలపై క్షేత్ర స్థాయి ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలిబాటలు తీయటం వలన గాలి, వెలుతురు సరిపడా మొక్కలకు అంది ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. దీంతో చీడ పీడలు, పురుగు ఉధృతి గణనీయంగా తగ్గుతుందన్నారు. ఎరువులు, పురుగుమందుల పిచికారీకి కాలిబాటలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ బీటీఎం రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

మణుగూరుటౌన్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ గుమ్మడి అరుణ తెలిపారు. శనివారం మణుగూరు మండలంలోని ఆశ్రమ గురుకుల బాలికల పాఠశాలలో అశ్వాపురం ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గుమ్మడి అరుణ సారథ్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైనవారికి మందులు అందజేశారు. ఆయుష్ ఆరోగ్య కరదీపికలను అందజేశారు. పారా మెడికల్ సిబ్బంది రాధిక, ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, తార పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూలో చేరిక

చర్ల: మండల కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శనివారం మిషన్ భగీరథ పథకంలో పని చేస్తున్న కార్మికులు ఐఎఫ్‌టీయూలో చేరారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య మండల కార్యదర్శి లంకా వెంకట్, నాయకులు కొండా చరణ, శివ, కనితి రాజేష్, నీలం వాసు, కార్తీక్, బుర్రా వర్మ, నవీన్, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



పినపాక: చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

పినపాక: మండలంలోని సీతంపేట, ఉప్పాక గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఎంపీపీ గుమ్మడి గాంధీ శనివారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. సర్పంచులు పోతినేని శివశంకర్, సుజాత, ఉప సర్పంచ్ కొండేరు నాగభూషణం, వార నరసింహారావు పాల్గొన్నారు.

చండ్రుగొండ : మండలంలోని రావికంపాడు గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను సర్పంచ్ బాణోత్ రణ్యానాయక్ శనివారం పంపిణీ చేశారు. నాయకులు శ్రీనివాసరావు, అబ్బాస్‌అలీ పాల్గొన్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

అశ్వారావుపేటరూరల్: వేగంగా దూసుకొచ్చి ఓ లారీ అదుపుతప్పి ప్రధాన రహదారిపై శనివారం తెల్లవారుజామున బోల్తా పడిపోయింది. స్థానికుల కథనం ప్రకారం.. సత్తుపల్లి వైపు నుంచి ఏపీకి కోళ్ల మేత లోడుతో వెళ్తున్న లారీ మండలంలోని నారంవారిగూడెం కాలనీ వద్ద హైవేపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు. లారీ ప్రధాన రహదారిపై అడ్డంగా పడిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

మహిళా హక్కుల కోసం పోరాడుదాం

గుండాల: మహిళల హక్కులు, సమానత్వంపై పోరాడాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి శారద పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో ఈ నెల 7, 8 తేదీల్లో మహబూబాబాద్‌లో జరుగు మహాసభలను జయప్రదం చేయాలని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మోకాళ్ల సుగుణ, ఇల్లందు మున్సిపల్ కౌన్సిలర్ నాగలక్ష్మి, రుక్మిని, కమల, కల్పన, శ్రీదేవి, రాదమ్మ పాల్గొన్నారు.

జాతరను ప్రశాంతంగా నిర్వహించాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఈ నెల 8 నుంచి జరిగే శ్రీ కట్టమైసమ్మ జాతర ఉత్సవాలను శనివారం స్థానిక ఎస్సై బి.రాజేశ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జాతర ఉత్సవాల్లో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని జాతర నిర్వహణ కమిటీ, గ్రామ పెద్దలకు సూచించారు. కమిటీ బాధ్యులు చందా లక్ష్మీనర్సయ్య, చిన్నంశెట్టి వెంకటనరసింహ, నారదాసు రామారావు ఉన్నారు.

వితరణ

మణుగూరు రూరల్: మండలంలోని సంతోష్‌నగర్‌లో గల బాలవెలుగు పాఠశాలకు పీకేఓసీ2 రక్షణ విభాగం ఉద్యోగులు శనివారం 125 కిలోల బియ్యాన్ని పీకేఓసీ రక్షణ అధికారి లింగబాబు వితరణగా అందజేశారు. సీనియర్ అండర్ మేనేజర్ వరుణ్, ఎండి.పర్వేజ్, కార్తీక్, సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, కార్మికులు ఉపేందర్, పతి, శేషగిరి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని ప్రజల సమస్యలపై పోరాటాలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కుంజా సత్యవతి అన్నారు. పట్టణంలోని ఆమె నివాసంలో శనివారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో ములిశెట్టి రామ్మోహన్‌రావు, వెంకన్న, వెంకటేశ్వర్లు, ఉపేంద్ర, క్రాంతిబాబు, జయరాజు, నిఖిల్, హరీష్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

భద్రాచలంటౌన్: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైన ఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మెడికల్ కాలనీకి చెందిన ఉద్యోగి రవికిరణ్ రెండు రోజుల క్రితం పనిఉందని చెప్పి ఊరికెళ్లాడు. అనంతరం కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఆర్థిక సమస్యలతో దూరంగా వెళ్తున్నానని చెప్పి ఫోన్‌స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో రవికిరణ్ కోసం వెతికిన కుటుంబసభ్యులకు ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం ఊరేగింపు..

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని పలు దేవాలయాల్లో నూతన జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించనున్నట్లు, శివాలయ పునర్నిర్మాణ వ్యవస్థాపకుడు మారగాని శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆలయాల్లో గణపతి పూజ, హోమాలు నిర్వహించి, ధ్వజ స్తంభం ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండల కేంద్రంలోని శ్రీ గోపయ్య, అంకమ్మ, తిరుపతమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల దేవాలయాల్లో వేద పండితుల సమక్షంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నారన్నారు.